సాక్షి వనపర్తి

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



మన బిడ్డగానే భావించాలి

ప్రతి విద్యార్థిని మన బిడ్డగానే భావించాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద అన్నారు.

వివరాలు 10లో ▸



'కురుమూర్తి'లో భక్తుల రద్దీ

కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.7 /13.8

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం, రాత్రివేళ చలి విపరీతంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

డీఈఓ అబ్దుల్ ఘని బాధ్యతల స్వీకరణ

వనపర్తి విద్యావిభాగం: జిల్లా విద్యాశాఖ అధికారిగా మహ్మద్ అబ్దుల్ ఘని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల విద్యాశాఖ చేపట్టిన బదిలీల్లో నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న అబ్దుల్ ఘనిని వనపర్తికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టిన ఆయన.. మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. అనంతరం విద్యాశాఖలోని ఆయా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రోగ్రెస్ వివరాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తే చర్యలు



వీపనగండ్ల: మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందకుండా ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ వెంకటరమణ హెచ్చరించారు. గురువారం వీపనగండ్లలో పర్యటించి, మిషన్ భగీరథ నీటి సరఫరాను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంతో ప్రజలకు తాగునీరు అందకుండా కొందరు పనిగట్టుకొని పైప్‌లైన్ ధ్వంసం చేయడం వంటి చర్యలకు పూనుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఉద్దేశపూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తే సహించమన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఎస్‌ఈ వెంట డీఈ అమిత్ కుమార్, ఏఈ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా సంతోష్‌కుమార్



స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీసీ రీజియన్ మేనేజర్‌గా పి.సంతోష్‌కుమార్ రానున్నారు. ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేస్తున్న వి.శ్రీదేవి హైదరాబాద్‌లోని బస్‌భవన్‌కు బదిలీ అయ్యారు. మూడు, నాలుగు రోజుల్లో నూతన ఆర్‌ఎం బాధ్యతలు చేపట్టనున్నారు. సంతోష్‌కుమార్ రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎంగా పనిచేస్తుండగా.. పదోన్నతిపై మహబూబ్‌నగర్‌కు ఆర్‌ఎంగా నియమితులయ్యారు. ఇతను 2000లో మొదట ఒంగోలు జిల్లా గిద్దలూరు డిపో మేనేజర్‌గా విధుల్లో చేరారు. తర్వాత కామారెడ్డి, జీడిమెట్ల, 2010లో సిటీలో డిప్యూటీ సీఎంఈగా పదోన్నతి పొందారు. డిప్యూటీ సీఎంఈగా మెదక్‌తో పాటు హెడ్‌ఆఫీస్‌లో మెకానికల్ ఇంజినీర్‌గా, కార్గోలో రెండేళ్ల పాటు హెడ్‌గా పనిచేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లాకు డిప్యూటీ ఆర్‌ఎంగా వచ్చారు.

వలసలు వాపస్ రావాలి

సీఎం అదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు..



పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

- ఉమ్మడి పాలమూరులో అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తాం..
- ఆదాయం వచ్చే పంటలు సాగు చేసే స్థితికి రైతులు చేరుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అమిస్తాపూర్‌లో అట్టహాసంగా రైతు పండుగ సదస్సు ప్రారంభం
- 117 స్టాళ్ల ఏర్పాటు, పలు ఎగ్జిబిట్ల ప్రదర్శన
- హాజరైన మంత్రులు దామోదర, జూపల్లి
- మరో 2 రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ : 'అదృష్టం కొద్దీ మీ జిల్లా బిడ్డ రేవంత్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత మళ్లీ మీ బిడ్డకు ఈ అవకాశం వచ్చింది. వలసల జిల్లా పేరొందిన పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే ఆయన లక్ష్యం. వలసలు వాపస్ వచ్చే జిల్లాగా మార్చాలని తాపత్రయపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో పాటు అన్ని ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. ఈ బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుంది. అందులో భాగంగానే సీఎం సొంత జిల్లాలో రైతు సదస్సును రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నాం' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న రైతు పండుగ సదస్సు గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకాగా.. పద్మశ్రీ అవార్డు గ్రహీత, రైతు చింతల వెంకటరెడ్డితో రిబ్బన్ కట్ చేయించి సదస్సును ప్రారంభించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, ఆహార పదార్థాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేలా మైదానంలో ఏర్పాటు చేసిన 117 స్టాళ్లు, ఎగ్జిబిట్లను తిలకించిన అనంతరం సదస్సులో తుమ్మల మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డిని ఉద్దేశించి మందు కొట్ట లేదు.. మందు వేయ లేదు.. 50 ఏళ్లుగా మట్టి తోటే వ్యవసాయం చేస్తూ అందరికంటే అధిక దిగుబడులు సాధిస్తున్నారని కొనియాడారు. హైదరాబాద్‌కు అతి దగ్గరలో వ్యవసాయం చేస్తున్నారని.. వరి, గోధుమలు, ద్రాక్ష.. ఇలా ఏ పంట వేసినా అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని వెల్లడించారు. భారత ప్రభుత్వమే ఆయకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు. ఈయనతో పాటు సాంకేతికతను ఉపయోగిస్తున్న వారు, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు చాలా మంది ఉన్నారని.. ఇంకా రెంటు రోజుల పాటు జరిగే సదస్సులో అలాంటి వారితో రైతులకు సాగులో మెళకువలు, అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, సెరికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాష, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పరికారెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత తదితరులు పాల్గొన్నారు.

పది జిల్లాల్లో ప్రతి ఏటా నిర్వహించాలి..

117 స్టాళ్లతో ఏర్పాటుచేసిన ఇంత గొప్ప రైతు సదస్సును ఇప్పటివరకు నేను చూడలేదు. వ్యవస్థ అనేది శాశ్వతం, పాలించే నాయకుల నిర్ణయాల్లో దార్శనికత, అంకిత భావం ఉండాలి. అలాంటి నిర్ణయాలు సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా చేయాలి, ఆధునిక పద్ధతులు, ఆధునిక వంగడాలపై సాంకేతికతను మేధావుల చేత రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు ప్రయోజనకరమైన ఇలాంటి సదస్సును రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాల్లో ప్రతి ఏటా నిర్వహిస్తే బాగుంటుంది.

– దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి

మాది రైతు ప్రభుత్వం..

సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.70 వేల కోట్ల కంటే తక్కువ రుణభారం ఉండేది. పదేళ్లలో బీఆర్‌ఎస్ ఏకంగా రూ.8లక్షల కోట్లు అప్పు చేసి ఈ ప్రభుత్వానికి అప్పజెప్పింది. ఈ అప్పులకు గడిచిన పది నెలల్లో సుమారు రూ.60 వేల కోట్లు వడ్డీ కిందనే చెల్లించాం. ఇలాంటి క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులు ఉన్నా.. మాది రైతు ప్రభుత్వం కనుకే రూ.18 వేల కోట్లతో రూ.2 లక్షల వరకు రైతు రుణాలను ఒకేసారి మాఫీ చేశాం. సన్నాలకు గిట్టుబాటు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తున్నాం.

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి

తొలిరోజు ఇలా..

రైతు పండుగ సదస్సులో భాగంగా తొలిరోజు గురువారం సెషన్ల వారీగా పలు శాఖలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం సైంటిస్టులు సాగు భూమిలో మట్టి నమూనాల సేకరణ.. పంట రకం, ఆయిల్‌పాం వంటి విత్తనాల తయారీ, పప్పు ధాన్యాల దిగుబడి, చీడ పీడలు, తెగుళ్లపై వివరించారు. నాబార్డు, వ్యవసాయ అధికారులు రైతుల విజయగాధలపై వీడియోలు ప్రదర్శించారు. రైతుల ఉత్పత్తిదారుల సంస్థలు, రైతు బీమా, రైతు భరోసా, పంట రుణాలపై పలు వివరాలను రైతులకు తెలియజేశారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సైంటిస్టులు వ్యవసాయ యాంత్రీకరణ, సుస్థిర వ్యవసాయం-సుస్థిర జీవనోపాధి, జీవ సంబంధ తెగుళ్ల నియంత్రణ, పంట అవశేషాల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

నేటి షెడ్యూల్..

రైతు సదస్సులో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లాకు చెందిన సైంటిస్టులు కూరగాయలు, పండ్లు, పూల పంటల సాగులో వంగడాలు, నూతన సాంకేతిక విధానాలను వివరించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన హార్టికల్చర్ అధికారులు ఉద్యాన పంటల ప్రణాళిక, సాగు.. ఆయిల్‌పాం సాగు, డ్రిప్, స్ప్రింక్లర్లు, సబ్సిడీ, ఉద్యానవనాల సమగ్రాభివృద్ధి, సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. అదే విధంగా పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు పశువుల ఉత్పత్తిలో సీడింగ్ నిర్వహణ-నూతన సాంకేతికత వినియోగంపై, పశుసంవర్ధక శాఖ అధికారులు పశువుల్లో వచ్చే వ్యాధులు-నియంత్రణ, మత్స్య శాఖ అధికారులు మిశ్రమ చేపల పెంపకంపై, అధునాతన పద్ధతిలో చేపల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.



రైతు సదస్సుకు హాజరైన ఉమ్మడి జిల్లా రైతులు



సదస్సు ప్రాంగణంలో బోనాలతో కళాకారుల ఆటాపాట

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

- విద్యార్థులకు మంచి భోజనం అందించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆహార భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాలయాల్లో ఆహారం నాణ్యతపై కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. వారంలో నాలుగు నుంచి ఐదుసార్లు తనిఖీలు చేపట్టాలని సూచించారు. లోపాలు కనిపిస్తే.. చర్యలకు సిఫారస్ చేయాలన్నారు. హాస్టళ్లకు సరఫరా చేసే బియ్యంతో పాటు కూరగాయలు, ఇతర వస్తువుల నాణ్యతను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని తెలిపారు. హోటళ్లలోనూ భోజనం నాణ్యతా ప్రమాణాలపై సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టాలని సూచించారు.

చెల్లింపుల్లో వేగం పెంచాలి..

కొనుగోలు చేసిన వరిధాన్యం డబ్బులు రైతులకు సకాలంలో చెల్లించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొన్న రెండు రోజుల్లో ట్యాబ్ ఎంట్రీలు, పేమెంట్ల ప్రక్రియ పూర్తికావాలన్నారు. చెల్లింపులు నెమ్మదిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 46,722 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని.. 25,543 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ. 59.26 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగతా చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

పకడ్బందీగా డేటా ఎంట్రీ..

జిల్లాలో నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి చెప్పారు. డేటా ఎంట్రీ ప్రక్రియపై కలెక్టరేట్‌లో మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వే ఫారాలు సూపర్‌వైజర్ల పర్యవేక్షణలోనే బయటకు తీసుకురావాలన్నారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 25 ఫారాలు తప్పనిసరిగా ఎంట్రీ చేయాలని.. వివరాలను నమోదు చేసిన తర్వాత సర్వే ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేకు సంబంధించి ఇంకా కొన్ని ఎన్యుమరేషన్ బ్లాక్‌లలో కొన్ని ఇళ్లు మిగిలిపోయాయని.. తాళంవేసి ఉన్న ఇళ్లను మళ్లీ విజిట్ చేసి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ యాదయ్య, డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, డీసీఓ ప్రసాదరావు, డీఎస్‌ఓ కాశీ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌తోనే ప్రమాదాలు

- వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలి
- ఎస్పీ రావుల గిరిధర్



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

కొత్తకోట: మద్యం తాగి వాహనాలు నడపడంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిసిట్యూట్‌ను ప్రారంభించారు. అనంతరం డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు అనేక కారణాలు ఉంటాయని, అందులో మద్యం తాగి వాహనాలు నడపడం.. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం లాంటివి ప్రధాన కారణాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపరాదన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని.. తద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం సీపీఆర్ విధానంపై వైద్యులు అవగాహన కల్పించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఇంటర్‌రైజ్ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ దీపమాదియా, సీఐ రాంబాబు, ఎస్‌ఐలు మంజునాథ్‌రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రామకృష్ణ, నేషనల్ హైవే అథారిటీ ఆపరేషన్ మేనేజర్ సంతోష్ కుమార్, రూట్ ఆఫీసర్ తేజ రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ అంటే ప్రత్యేక అభిమానం

- సినీ నటుడు విజయ్ దేవరకొండ
- రెండోరోజు ఉత్సాహంగా ఆర్ఐడీ స్వర్ణోత్సవాలు



చిన్నారులతో సినీ నటుడు విజయ్ దేవరకొండ

కొల్లాపూర్: 'మా తాతయ్య కొల్లాపూర్‌లోనే ఉద్యోగం చేశారు.. మా అమ్మ, మేనమామ ఆర్ఐడీ పాఠశాలలోనే ఒక సంవత్సరం పాటు చదువుకున్నారు. సింగోటం జాతరకు వెళ్లి అక్కడ లక్ష్మీనర్సింహస్వామికి మొక్కులు తీర్చుకున్న విషయాలు కూడా నాకు గుర్తున్నాయి. కొల్లాపూర్ అంటే నాకు ప్రత్యేక అభిమానం. ఈ వేడుకలకు రావడం సంతోషంగా ఉంది' అని సినీ నటుడు విజయ్ దేవరకొండ అన్నారు. కొల్లాపూర్‌లో నిర్వహించిన ఆర్ఐడీ స్వర్ణోత్సవ వేడుకలకు గురువారం రెండోరోజు ఆయన హాజరయ్యారు. ముందుగా ఆర్ఐడీ పూర్వ విద్యార్థులతోపాటు, పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ఆర్ఐడీ పాఠశాలలో చదువుకున్న వాళ్లు ఎంతో గొప్పగా ఎదిగారని, రామేశ్వర్‌రావు వంటి పారిశ్రామికవేత్తలు, కృష్ణారావు లాంటి రాజకీయ నాయకులు ఇక్కడే చదువుకున్నారని పేర్కొన్నారు. దాదాపుగా 14 యూనివర్సిటీలకు ఆర్ఐడీ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వైస్‌చాన్స్‌లర్‌గా పనిచేశారని, ఇది గొప్ప విషయమని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. కొల్లాపూర్ యువత పారిశ్రామిక వేత్తలుగా, ప్రొఫెసర్లు, డాక్టర్లుగా, సినీ నటులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఆర్ఐడీ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆర్ఐడీ స్వర్ణోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థులు తిరుపాలు, వెంకట్‌దాసు రూపొందించిన పాటల సీడీలను ఆవిష్కరించారు. యువకులు, విద్యార్థులతో సెల్ఫీలు దిగి.. సందడిగా గడిపారు.

వండర్ వరల్డ్ రికార్డు..

94 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ఐడీ పూర్వ విద్యార్థులను సంఘటితం చేసి, వేడుకలు నిర్వహించడం గొప్ప విషయమని, ఈ వేడుకలకు 200 మందికి పైగా పూర్వ గురువులతో పాటు, 2 వేల మంది వరకు పూర్వ విద్యార్థులు హాజరుకావడం, మూడు రోజుల పాటు వేడుకల్లో పాల్గొనడం రికార్డు అని వండర్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు వెల్లడించారు. వేడుకలు ఏర్పాటు చేసిన ఆర్ఐడీ అల్యుమిని వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సాయిప్రసాద్, కార్యదర్శి కటికనేని మదన్‌మోహన్‌రావుకు వారు రికార్డు పత్రాన్ని అందజేశారు.

ప్రముఖుల ప్రసంగాలు..

స్వర్ణోత్సవాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, బిట్స్ పిలానీ వీసీ వలిపె రాంగోపాల్‌రావు, హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కట్టా జయరాంరెడ్డి ప్రసంగించారు. కొల్లాపూర్ ఖ్యాతిని పెంచేందుకు ఆర్ఐడీ పూర్వ విద్యార్థులతోపాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. యశోద హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ సురేందర్‌రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొల్లాపూర్‌లో యశోద హాస్పిటల్ అన్ని వసతులతో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కవి, రచయిత అందెశ్రీ మాట్లాడుతూ కొల్లాపూర్ అభివృద్ధికి ఈ ఉత్సవాల ద్వారా పూర్వ విద్యార్థులు నడుం బిగించడం సంతోషించదగ్గ అంశమన్నారు.

ఆన్‌లైన్‌లో ఆరోగ్య ప్రొఫైల్

- గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే
- కుటుంబాల ఆరోగ్యం, ఆర్థిక, చదువు వివరాల సేకరణ
- జిల్లాలో 44 గ్రామాల ఎంపిక

మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాలు..

మండలం	గ్రామాలు
వీపనగండ్ల	పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లి, గోవర్ధనగిరి, కల్వరాల
చిన్నంబావి	కల్లూర్, దగడపల్లి, బెక్కం
ఖిల్లాఘనపురం	సోలీపూర్, మల్కాపూర్, పర్వతాపూర్, ఖిల్లాఘనపురం
పెద్దమందడి	అల్వాల్, మనిగిళ్ల, పెద్దమందడి
గోపాల్‌పేట	బుద్ధారం, గోపాల్‌పేట
పాన్‌గల్	రేమద్దుల, తెల్లరాళ్లపల్లి
మదనాపురం	దుప్పల్లి, కొన్నూరు
ఆత్మకూర్	దేవర్‌పల్లి, సింగంపేట, మేడేపల్లి
అమరచింత	నాగల్‌కడ్మూర్, అమరచింత
కొత్తకోట	పామాపురం, రామకృష్ణాపురం, కానాయిపల్లి
శ్రీరంగాపురం	కంభాళాపురం, నాగరాల, వెంకటాపురం
పెబ్బేరు	రంగాపురం, పెబ్బేరు, సూగూరు
వనపర్తి	వనపర్తి పట్టణం



ఆత్మకూర్ మండలం మేడేపల్లిలో ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

వివరాలు పొందుపరుస్తున్నాం

ప్రజల నుంచి సేకరించిన ఆరోగ్య, ఆర్థిక, చదువు సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. ఎంపిక చేసిన ప్రతి గ్రామంలో ఏడుగురు సభ్యులతో కూడిన బృందం మహిళలు, పురుషుల నుంచి వేర్వేరుగా వివరాలు సేకరిస్తున్నాం. స్థానిక ఆరోగ్యశాఖ అధికారుల సహకారంతో సర్వేను పూర్తిచేస్తున్నాం.

– మహేష్, టీం సూపర్‌వైజర్

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య, ఆర్థిక, జీవన విధానాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కొనసాగుతోంది. సర్వే నిమిత్తం జిల్లాలోని 14 మండలాల్లో 44 గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో 22 కుటుంబాలను ప్రత్యేకంగా ఎంపిక చేసి, వారి నుంచి ఆరోగ్య సమాచారం సేకరిస్తున్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి ప్రారంభమైన సర్వే.. జిల్లాలో 93 శాతం పూర్తయింది. మిగిలిన కుటుంబాల నుంచి కూడా నిర్ణీత గడువులోగా సమాచారం సేకరించడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. జిల్లాలో మొత్తం ఏడు బృందాలతో సర్వే చేయిస్తున్నారు. ఈ సర్వేతో రాబోయే ఐదేళ్ల కాలంలో జిల్లావ్యాప్తంగా ఎలాంటి ఆరోగ్య వసతులు కల్పించనున్నారు. గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ఉన్నాయనే విషయాలను ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ఐదు రకాల టెస్టులు..

గ్రామాల్లో ఎంపిక చేసిన కుటుంబాల్లోని సభ్యులకు ఐదు రకాల టెస్టులు నిర్వహించేందుకుగాను రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అదే విధంగా కపం, బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎన్ని సంవత్సరాలుగా వ్యాధి బారిన పడి వైద్యసేవలు పొందుతున్నారనే విషయాలను తెలుసుకుంటున్నారు. వీటితో పాటు కుటుంబ సభ్యుల చదువులు, ఆర్థిక పరిస్థితుల వివరాలను సైతం ఆయా కుటుంబాల నుంచి సేకరించి, ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. 22 కుటుంబాల నుంచి సేకరించిన అంశాలతో గ్రామంలో ఆరోగ్య స్థితిగతులు ఎలా ఉన్నాయనే నిర్ధారణ చేసుకునే అవకాశం ఉంటుందని హెల్త్ సూపర్‌వైజర్లు వెల్లడిస్తున్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ పరిధిలో సర్వే చేస్తున్న సిబ్బందికి నెలవారీ వేతనాలతో పాటు టీఏ, డీఏలు అందిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


చెన్నయ్య (ఫైల్)

కోస్గి రూరల్: తమ వ్యవసాయ పొలానికి నీరు పారబెట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని లోదిపూర్ గ్రామానికి చెందిన వలుపలి చెన్నయ్య(52) గురువారం ఉదయం తన వ్యవసాయ పొలంలో వరి చేను కోసం కరిగెట కట్టడానికి వెళ్లాడు. అయితే బోరు మోటారు స్టార్ట్ కాకపోవడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను బందు చేయడానికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన బాటసారులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ప్రైవేట్ వాహనంలో కోస్గిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చెన్నయ్య భార్య భగవంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాలయ్య తెలిపారు. చెన్నయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


సత్యారెడ్డి (ఫైల్)

మక్తల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకోని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మక్తల్ పట్టణంలో బసవేశ్వర కాలనీల్లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మక్తల్ పట్టణంలో బసవేశ్వర కాలనీకి చెందిన సత్యారెడ్డి (32) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆతను ఆర్థిక ఇబ్బందుల వల్ల బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

భార్యతో గొడవ పడి భర్త..

జడ్చర్ల: భార్యతో గొడవ పడిన భర్త ఇంటి నుంచి వెళ్లిపోయి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కావేరమ్మపేటలో గరువారం వెలుగు చూసింది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం అప్పారెడ్డి గ్రామానికి చెందిన మహ్మద్ ఖాజా(37) భార్య ఫర్జానా బేగంతో కలిసి ఆరేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కావేరమ్మపేటకు వలస వచ్చారు. కావేరమ్మపేటలో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరుచు గొడవలు జరుగుతుండేవి. గొడవ జరిగినప్పుడల్లా సొంత ఊరులోని కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్తుండేవాడు. ఈనెల 19న ఇదే రీతిలో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఖాజా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య అప్పారెడ్డిపల్లిలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా బంధువుల దగ్గర, తదితర చుట్టుపక్కల గాలింపు చేశారు. కావేరమ్మపేట పశువుల సంత సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఖాజా సోదరుడు షాబుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిందితులకు రిమాండ్

తెలకపల్లి: భర్తను హత్య చేసిన కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఈ నెల 23న మండలంలోని వట్టిపల్లి గ్రామంలో మూడిండ్ల ఈశ్వరయ్యను తన భార్య ఎల్లమ్మ, ఆమె కూతురు స్వాతి, అల్లుడు మల్లేష్‌లతోపాటు మరో ఇద్దరు కుటుంబ సభ్యులు కలిసి కలిసి దారుణంగా నరికి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య విచారణ అనంతరం బుధవారం రాత్రి నిందితురాలు భార్య ఎల్లమ్మ, కూతురు స్వాతి, అల్లుడు మల్లేష్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

వ్యవసాయ యంత్రాలు అదుర్స్

రైతు పండుగలో ప్రత్యేకంగా స్టాళ్ల ఏర్పాటు

జిల్లా కేంద్రం సమీపంలోని అమిస్తాపూర్ వద్ద నిర్వహిస్తున్న రైతు పండుగ కార్యక్రమంలో వ్యవసాయ యంత్రాల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గురువారం రైతు పండుగను ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర క్రీడలు, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ స్టాల్స్‌ను సందర్శించారు. మొత్తం 118 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయానికి ఉపయోగపడే యంత్రాలను రైతులు పరిశీలించి, వాటి వివరాలను తెలుసుకున్నారు. యంత్రాల పనితీరును స్టాల్స్ నిర్వాహకులు రైతులకు వివరించారు.

– మహబూబ్‌నగర్ న్యూటౌన్



■ ఈ యంత్రం పేరు అగ్రీ డ్రోన్. దీన్ని విలువ రూ. 5లక్షలు. ప్రభుత్వ సబ్సిడీ ఏమీ లేదు. అగ్రీ డ్రోన్ ద్వారా పంటలకు క్రిమిసంహారక, ఇతర మందులను స్ప్రే చేయవచ్చు. తద్వారా సమయం ఆదాతో పాటు ఖర్చు సైతం తక్కువ అవుతుంది. దీన్ని గరిష్ట పేలోడ్ సామర్థ్యం 10 లీటర్లు. ఒక పేలోడ్‌తో 24 నిమిషాలు స్ప్రే చేయవచ్చు. ఇది బ్యాటరీ చార్జింగ్‌తో పనిచేస్తుంది. రోజుకు 30 నుంచి 35 ఎకరాల వరకు స్ప్రే చేయవచ్చు. రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేసుకోవచ్చు. పంట ఎత్తును బట్టి తగిన మోతాదులో మందులు పిచికారీ చేయవచ్చు. అగ్రీ డ్రోన్ స్ప్రే రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది.



■ దీన్ని పేరు పెగాసిస్–250. జీఐఎస్ ల్యాండ్ సర్వేను చాలా సులువుగా చేపట్టవచ్చు. దీన్ని విలువ రూ. 20లక్షలు ఉంటుంది. పూర్తిగా రిమోట్ కంట్రోల్ ద్వారా ఆపరేట్ చేయవచ్చు. ఒకసారి ఇది పైకి ఎగిరిన తర్వాత 4 స్క్వైర్ కిలోమీటర్ల వరకు కవర్ చేస్తూ.. పక్కాగా కొలతలు నమోదు చేస్తుంది. బ్యాటరీ సహాయంతో నడిచే ఈ పెగాసిస్–250.. పైకి ఎగిరిన తర్వాత రెండు గంటలు, 50 కిలోమీటర్ల రేంజ్ వరకు ఆటోనామస్ ఫ్లయింగ్ ద్వారా సర్వే చేపట్టేందుకు అవకాశముంటుంది. ప్రభుత్వం డీజీసీఏ సర్టిఫికేషన్ అనుమతి కోసం ప్రతిపాదించారు. దీనికి అనుమతి వస్తే ల్యాండ్ సర్వే చాలా సులువుగా చేయవచ్చు. ప్రస్తుతం భూసమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. దీనికి ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే అక్యూరేట్ కొలతలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో భూమి కొలతలు చేపట్టవచ్చు.



■ ఈ యంత్రం పేరు బూం స్ప్రేయర్. దీన్ని విలువ రూ. 18లక్షలు. ప్రభుత్వ సబ్సిడీ ఏమీ లేదు. వ్యవసాయ రంగంలో కమర్షియల్ తోటలు, కూరగాయలు, వరి, పత్తి, జొన్న, వేరుశనగ, మినుము, పెసర్లు, మిరప వంటి తోటలకు మందుల పిచికారీ కోసం వినియోగించే మిషన్ ఇది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు మందులను పిచికారీ చేసేందుకు ఉపయోగ పడుతుంది. ఇది 600 లీటర్ల సామర్థ్యంతో నడుస్తుంది. గంటకు 6 ఎకరాల విస్తీర్ణంలో మందులు పిచికారీ చేయవచ్చు.



■ ఈ యంత్రం పేరు ఈజీబో. ఎద్దు చేసే వ్యవసాయ పని మొత్తం దీన్ని ద్వారా చేయవచ్చు. దీన్ని విలువ రూ. 2.75లక్షలు. ప్రభుత్వ సబ్సిడీ ఏమీ లేదు. రిమోట్ కంట్రోల్ సిస్టం ద్వారా దీన్ని ఆపరేట్ చేయవచ్చు. కలుపు తీయడం, రోటవేటర్, గ్రాస్ కట్టర్, ట్రాలీ పని, గుంతలు తవ్వడం, డోజర్ పని, స్ప్రేయింగ్, గొర్రు కొట్టడం, మల్చింగ్, గుంటక, సీడర్ వంటి 20 రకాల వ్యవసాయ పనులు దీని ద్వారా చేయవచ్చు. బ్యాటరీ సహాయంతో ఇది నడుస్తుంది. ఒకసారి రీచార్జ్ చేస్తే మూడు గంటల వరకు నడుస్తుంది. ఈ మిషన్ ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పని జరుగుతుంది. ప్రస్తుతం కూలీల కొరత ఉన్న నేపథ్యంలో ఈ మిషన్ రైతులకు ఎంతో ఉపయోగ పడుతుంది.



■ ఇది మొబైల్ సోలార్ పంపు. చెరువులు, బావుల్లో నీటిని తోడేందుకు ఎక్కువగా ఉపయోగ పడుతుంది. రోజుకు లక్ష లీటర్ల వరకు నీటిని తోడే సామర్థ్యంతో ఈ మొబైల్ సోలార్ పంపు పనిచేస్తుంది. సోలార్ ప్యానెల్, బ్యాటరీ ద్వారా 60 నుంచి 100 ఓల్టేజీతో పనిచేస్తుంది. చెరువులు, రొయ్యల చెరువుల్లో నీటిని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది ఒక ఎకరం నుంచి రెండు ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులకు ఎంతో అనుకూలం.



■ అత్యుత్తమ జన్యులక్షణాలతో కూడిన ఈ ఆవులను భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామంలో పాలమూరు జనెటిక్స్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వారు పెంచుతున్నారు. భారతీయ పశుసంవర్ధక రంగంలో సరికొత్త విప్లవం తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఐవీఎఫ్, ఈటీ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి, అత్యుత్తమ జన్యు లక్షణాలతో కూడిన ఆవులు, గేదెలను తయారు చేస్తున్నారు. గిర్, సాహివాల్, కంక్రేజ్, డియోని, ఒంగోలు, పుంగనూరు, ముర్రా, జాఫ్రాది వంటి జాతులను స్వదేశీ క్రాస్ బ్రీడ్ ద్వారా తయారు చేస్తున్నారు. వీటి ద్వారా రైతులు ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశముంది.

దేశం.. తెలంగాణ వైపు చూస్తోంది..



సంకల్పం మంచిదైతే ప్రకృతి కూడా సహకరిస్తుంది. మనసులో, కడుపులో విషాన్ని నింపుకొని గత పాలకులు పాలన సాగించారు. ఏడాది కాలంలో రైతులను రుణ విముక్తుల్ని చేయడం, సన్నవడ్లకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇచ్చిన చరిత్ర ఈ రైతు ప్రభుత్వానిది. కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో ఏ దేశ టెక్నాలజీ వాడుతున్నారో గానీ, ప్రజలకు మాత్రం దాన్ని అందించలేదు. మాది రైతు క్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం. అందుకే రైతులకు ఉత్తమ వ్యవసాయ పద్ధతులను పరిచయం చేస్తున్నాం. దేశం మొత్తం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

రేపటి సీఎం సభను విజయవంతం చేయాలి..



ఈ నెల 30వ తేదీ వరకు మూడు రోజులపాటు రైతులకు సేంద్రియ, ఆధునిక వ్యవసాయంపై ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, దర్శ రైతులు అవగాహన కల్పిస్తారు. చివరి రోజు 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సదస్సుకు వస్తారు. బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. ఆ సభా వేదిక నుంచి రైతులకు సంతోషకరమైన ప్రకటన చేసే అవకాశం ఉంది. రాష్ట్రం నలుమూలల నుండి రైతులు భారీగా తరలివచ్చి.. సదస్సును సద్వినియోగం చేసుకోవడంతో పాటు విజయవంతం చేయాలి.

– జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే

జూరాలలో పూడికతీతకు చర్యలు..



2004 కంటే ముందు పాలమూరు జిల్లాలో పరిస్థితులు చాలా దుర్భరంగా ఉండేవి. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలమూరు జిల్లాలో బీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వంటి నీటి పారుదల ప్రాజెక్టులను ప్రారంభించి కొంతవరకు పూర్తిచేయడం వల్ల జిల్లాలో సాగు నీరు పారింది. దాన్ని కొనసాగిస్తోంది ఈ ప్రభుత్వం. వీటితోపాటు పాలమూరు–రంగారెడ్డి ఫేజ్–2 ప్రారంభించి.. కాల్వలు పూర్తి చేస్తే మరో పది లక్షల ఎకరాలకు సాగు నీరందించవచ్చు. జూరాల ప్రాజెక్ట్ పూడికతో నిండిపోయింది. ప్రస్తుతం 6 నుంచి 7 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంటోంది. జూరాలలో పూడిక తీయాలని గత ప్రభుత్వానికి విన్నవిస్తే పెడ చెవిన పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే జూరాలలో పూడిక తీసే కార్యక్రమం చేపట్టనుంది. దీని వల్ల 16 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు.

– డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు

రైతును రాజు చేయడమే లక్ష్యంగా..



గత ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చాక రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. వ్యవసాయంపై మమకారంతో రైతులకు అండగా ఉండే అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ధరణి కమిటీ వేయడం, ఆర్వోఎఫ్ఆర్ చట్టం తేవడం, ధరణి సాఫ్ట్‌వేర్ నియంత్రణకు సంబంధించి ఎన్ఐసీ సంస్థకు ఇవ్వడం ఇందుకు నిదర్శనం.

– కోదండరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్,

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ


ఉండవెల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుమందు తాగి పడిపోయిన దంపతులు

- పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేశారని స్టేషన్ ఎదుటే రాళ్ల దాడి
- పురుగు మందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

ఉండవెల్లి: భూ వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదైన సంఘటన ఉండవెల్లిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండల కేంద్రంలోని పింజరి ఖాజాబీ కంది పంటను ట్రాక్టర్‌తో ఈ నెల 26న తొలగించారని మాసుం, ఖాసీంలపై ఫిర్యాదు చేయగా హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ కేసు నమోదు చేశారు. అయితే మధ్యాహ్న సమయంలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఖాజాబీ కుమారుడు పింజరి మహ్మద్ ఫిర్యాదు చేసిన దరఖాస్తును తీసుకెళ్తుండగా ఎందుకు కేసు పెట్టావని మాటమాట పెరగడంతో గొడవకు దారి తీసింది. తల్లి, తండ్రి, కొడుకులు ఖాసీం, మాసుంలు ముగ్గురు కలిసి పింజరి మహ్మద్‌ను రాళ్లతో దాడి చేయగా తలకు రక్త గాయాలవడంతో, అదే సమయంలో మాసుంపై కూడా రాళ్లతో మహ్మద్ దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. దీంతో పింజరి మహ్మద్ ఫిర్యాదుతో ఖాసీం, మాసుంలపై, మాసుం ఫిర్యాదుతో మహ్మద్‌పై హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ కౌంటర్ కేసు నమోదు చేశారు. అనంతరం గాయాలైన ఖాసీం దంపతులు ఆర్ఎంపీ ఆస్పత్రి వద్దకు చికిత్స కోసం వెళ్లి.. అక్కడే పురుగు మందు తాగి.. పోలీస్‌స్టేషన్ ముందుకు వచ్చి న్యాయం చేయాలని కోరుతూ స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే పోలీస్ సిబ్బంది, స్థానికులు వారిని 108లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.


బాధితులను 108లో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 390 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 660 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 25 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 855 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

కేజీబీవీ ఘటనపై కలెక్టర్ సీరియస్

- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

నవాబుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం అల్పాహారం తయారు చేస్తుండగా.. ఓ విద్యార్థినిపై వేడి నూనె పడి గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కలెక్టర్ విజయేందిర బోయి సీరియస్ అయ్యారు. కేజీబీవీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రశాంతిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇటీవల పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు చోటు చేసుకుంటున్న తరుణంలో నవాబుపేట కేజీబీవీ ఘటన సైతం కీలకంగా మారింది. కేజీబీవీలో నిత్యం విద్యార్థినులతో వంట పనులు చేయిస్తున్న విషయం బహిర్గతం కావడంతో జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ బాధ్యులపై చర్యలు చేపట్టారు.

'అంజన్న' ఆలయ టెండర్లు పూర్తి

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట ఆంజనేయస్వామి దేవాలయ టెండర్లు గురువారం దేవాదాయ, ధర్మాదాయ మహబూబ్‌నగర్ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీణదారి, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం, సీల్డ్ కవర్ టెండర్లు నిర్వహించారు. ఈ వేలంలో కొబ్బరికాయల టెండర్ జడ్చర్లకు చెందిన ఎస్.శ్రీనివాసులు రూ.14. 80 లక్షలకు, దేవస్థాన లడ్డు, పులిహోర లింగంపేటకు చెందిన జె.యాదయ్య రూ.18.60 లక్షలకు, వాహనాల పూజ సామగ్రిని ఊరుకొండ పేటకు చెందిన కొండ యాదగిరి రూ.10.11లక్షలకు దక్కించుకున్నారు. మిగతా తలనీలాలు, కిరణం షాపులు, కొబ్బరి చిప్పల టెండర్లు వాయిదా పడ్డాయి. వాయిదా పడిన టెండర్ల వేలం తేదీని త్వరలోనే ప్రకటిస్తామని దేవాలయ ఈఓ సత్యచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ అధికారులు మారుతి రావు, రంగనాథ్, వరలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి, మనోహర్ రెడ్డి, అశోక్, మల్లేష్, దేవాలయ సిబ్బంది, టెండర్ దారులు పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో బాలింత మృతి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- ఇద్దరు నర్సులను సస్పెండ్ చేసిన సూపరింటెండెంట్


నర్సింగ్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న బాధితులు

పాలమూరు: వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాలింత మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గండేడ్ మండలం ఆసిరెడ్డిపల్లికి చెందిన రజిత(35) రెండోకాన్పు కోసం బుధవారం మధ్యాహ్నం జనరల్ ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో అడ్మిట్ అయ్యింది. అయితే మధ్య రాత్రి సెక్షన్ ద్వారా కాన్పు చేయగా మగ శిశువు జన్మనిచ్చింది. ఆపరేషన్ తర్వాత బాలింత పరిస్థితి కొంత విషమంగా ఉండటంతో ఐసీయూకి తరలించారు. ఉదయం పరిస్థితి విషమించి బాలింత మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, చికిత్సపరంగా ఏది అడిగిన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాలింత భర్త సూపరింటెండెంట్ ఎదుట వాపోయాడు. 14 మందిలో ఒక ఆమె చనిపోతే ఏమవుతుందని మాట్లాడారని, ఇలాంటి సిబ్బందిని సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్‌సింగ్‌ను వివరణ కోరగా రేడియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల ప్రొఫెసర్లతోపాటు ఆర్ఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లతో కమిటీ వేశామని, విచారణ పూర్తయ్యే వరకు ఇద్దరు నర్సులు అండర్ సస్పెన్షన్‌లో ఉంటారని వెల్లడించారు. సాధారణంగా వయస్సు ఎక్కువ ఉన్న వాళ్లు ప్రసవం సమయంలో హైరిస్క్ ఉంటుందని, ప్రస్తుతం మృతిచెందిన బాలింత సైతం హైరిస్క్ కేసు ఉందని చెప్పారు. ఆమె మొదటి కాన్పు.. రెండో కాన్పునకు 13 ఏళ్ల గ్యాప్ ఉందని, ఇంటర్నల్ బ్లీడింగ్ కావడం వల్లే మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

ఆటోబోల్తా : కూలీలకు గాయాలు


ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన కూలీలు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట సమీపంలోని వైకుంఠధామం వద్ద గురువారం సాయంత్రం పత్తి కూలీలను తరలిస్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కొత్తపల్లినికి చెందిన కూలీలకు స్వల్ప గాయాలు కాగా, రామాంజనేయమ్మకు బలమైన గాయాలయ్యాయి. వారిని 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొత్తపల్లికి చెందిన 15 మంది కూలీలు ఉప్పునుంతల మండలంలోని దాసర్లపల్లిలో రైతు పొలంలో పత్తి తీయడానికి ఆటోలో వెళ్లి వస్తున్నారు. కేవలం నాలుగురు కెపాసిటీ కలిగిన ఆటోలో పరిమితికి మించి 20 మందిని తరలిస్తున్నా అధికారులు పట్టింపు లేదు. దీని వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రెండు గుడిసెలు దగ్ధం

మన్ననూర్: విద్యుదాఘాతంతో రెండు గుడిసెలు దగ్ధమైన సంఘటన అమ్రాబాద్ మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుర్కపల్లిలో గురువారం తెల్లవారు జామున పక్కపక్కనే ఉన్న కుంద వెంకటేశ్వర్లు, కుంద సుదర్శన్‌కు చెందిన పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల ధాటికి గుడిసెలో ఉన్న సిలిండర్ పేలింది. గ్రామస్తుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఫైర్ సర్వీస్‌తో వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సంఘటన సమాచారం తెలుసుకున్న అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రెండు ఇండ్లు కాలిపోవడంతో ఒక్కో ఇంటిలో సుమారు రూ: 1.50 లక్షల పైగా ఆస్తి నష్టమైనట్లు బాధితులు తెలిపారు.


తుర్కపల్లిలో మంటల్లో కాలిపోతున్న గుడిసెలు

చెరుకు పంటదగ్ధం

మక్తల్: మండలంలోని అనుగొండలో మాజీ సర్పంచు గడ్డం రమేష్‌కు చెందిన 6 ఎకరాల చెరుకుపంటకు నిప్పు అంటించడంతో పూర్తిగా కాలిపోయింది. తనపై కక్షకట్టి, ఉద్దేశపూర్వకంగానే దుండగులు చేశారని బాధితుడు పేర్కొన్నాడు. పంట చేతికొచ్చే సమయంలో ఈ పని చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. దాదాపు రూ.4 నుంచి రూ.6 లక్షల నష్టం ఏర్పడిందని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తిని నలుగురు విద్యార్థులకు వాంతులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం తిని నలుగురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. పాఠశాలలో 110 మంది విద్యార్థులు చదువుతుండగా శుక్రవారం 100 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టారు. టమాట రైస్‌తోపాటు భోజనంలో ఒక గుడ్డు ఇచ్చారు. అయితే భోజనం చేసిన వారిలో మూడో తరగతి చదువుతున్న ప్రణయ్, మరో ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం అశోక్‌ను వివరణ కోరగా ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారని, కానీ ఎలాంటి ప్రమాదం లేదని, వెంటనే నయమైందని ఆస్పత్రికి కూడా తీసుకెళ్లే అవసరం కూడా రాలేదని చెప్పారు.

డిస్కంల దివాలా బాట!

- తీవ్ర ఆర్థిక నష్టాల్లో దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు
- 2022–23 నాటికే రూ.6,76,681 కోట్లకు చేరిన నష్టాలు
- తెలంగాణలోని రెండు డిస్కంల నష్టాలు రూ.60,922 కోట్లు
- నష్టాల్లో దేశంలోనే ఐదో స్థానంలో తెలంగాణ డిస్కంలు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ఏటేటా నష్టాల్లో కూరుకుపోతున్నాయి. అత్యధిక నష్టాలున్న డిస్కంలు కలిగిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ దేశంలోనే ఐదో స్థానంలో ఉన్నది. దేశంలో ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని డిస్కంలకు కలిపి 2015–16లో రూ.3,74,099 కోట్ల నష్టాలు ఉండగా.. 2022–23 నాటికి అవి రూ.6,76,681 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో తెలంగాణ డిస్కంల నష్టాలు రూ.16,520 కోట్ల నుంచి రూ.60,922 కోట్లకు ఎగబాకాయి. రాజ్యసభలో ఎంపీ సంజయ్‌కుమార్ ఝా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలు వెల్లడించింది. ప్రభుత్వరంగ డిస్కంల నష్టాల్లో రూ.1,62,507 కోట్లతో తమిళనాడు దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. రూ.92,070 కోట్ల నష్టాలతో రాజస్థాన్, రూ.91,632 కోట్ల నష్టాలతో ఉత్తరప్రదేశ్, రూ.64,843 కోట్ల నష్టాలతో మధ్యప్రదేశ్ వరుసగా 2,3,4 స్థానాల్లో ఉన్నాయి.

లాభాల్లో ప్రైవేటు.. నష్టాల్లో సర్కారీ సంస్థలు

దేశంలోని ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల్లో కూరుకుపోయి దివాలా అంచున నిలువగా, ప్రైవేటు రంగ డిస్కంలు మాత్రం లాభాల్లో దూసుకుపోతున్నాయి. 2015–16 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు రంగ డిస్కంల లాభాలు రూ.12,146 కోట్లు ఉండగా.. 2022–23 నాటికి రూ.23,116 కోట్లకు పెరిగాయి. ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 12 ప్రైవేటు డిస్కంలు ఉండగా, అవన్నీ లాభాల్లోనే నడుస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో 42 డిస్కంలు ఉండగా.. గుజరాత్‌లోని మూడు, కర్ణాటక, పశ్చిమబెంగాల్‌లో ఒక్కో డిస్కం కలిపి మొత్తం ఐదు మాత్రమే లాభాల్లో ఉన్నాయి. మిగిలిన 37 ప్రభుత్వ రంగ డిస్కంలు నష్టాల్లో కూరుకుపోయాయి.

మోయలేని అప్పుల్లో దక్షిణ తెలంగాణ డిస్కం


తెలంగాణలో రెండు ప్రభుత్వ రంగ డిస్కంలున్నాయి. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నష్టాలు 2015–16లో రూ.10,625 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.42,330 కోట్లకు చేరాయి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) నష్టాలు ఇదే కాలంలో రూ.5,895 కోట్ల నుంచి 2022–23 నాటికి రూ.18,592 కోట్లకు పెరిగాయి.

భారీగా పెరిగిన అప్పులు

దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ డిస్కంల అప్పులు 2015–16లో రూ.4,08,941 కోట్లు ఉండగా, 2022–23 నాటికి రూ.6,61,263 కోట్లకు పెరిగాయి. ఇదేకాలంలో తెలంగాణ డిస్కంల అప్పుల రూ.13,944 కోట్ల నుంచి రూ.35,883 కోట్లకు పెరిగాయి.

దేశంలోని డిస్కంల పరిస్థితి

- మొత్తం ప్రభుత్వరంగ డిస్కంలు 42
- నష్టాల్లో ఉన్న ప్రభుత్వరంగ డిస్కంలు 37
- 2022–23 నాటికి సర్కారు డిస్కంల నష్టాలు రూ.6,76,681
- లాభాల్లో ఉన్నవి 5
- దేశంలో మొత్తం ప్రైవేటు డిస్కంలు 12
- లాభాల్లో ఉన్న ప్రైవేటు డిస్కంలు 12



కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు.. క్షమాపణ చెప్పాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించాయి. సిరిసిల్ల కలెక్టర్‌ను 'సన్నాసి.. కాంగ్రెస్ కార్యకర్త'.. అంటూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఒక సభలో వ్యాఖ్యానించడం తెలిసిందే. పాలనా విధానాలు, రాజ్యాంగ నిబద్ధత ఆధారంగా సివిల్ సర్వెంట్లు నిర్వర్తించే బాధ్యతలకు విరుద్ధంగా కేటీఆర్ వ్యాఖ్యలున్నాయని వారు మండిపడ్డారు. ప్రజాసేవలో అధికారి విధులను నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా, ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వహించాల్సి ఉంటుందని సంఘాలు గుర్తు చేశాయి. కానీ ఊహించని ఇటువంటి నిరాధార ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయని తెలిపాయి. సిరిసిల్ల కలెక్టర్‌కు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ పూర్తి మద్దతు తెలియజేస్తుందని ఐపీఎస్ అధికారుల సంఘం పేర్కొంది. సివిల్ సర్వీసు అధికారుల గౌరవం, స్వతంత్రత, నిష్పక్షపాతత్వాన్ని కాపాడేందుకు అండగా నిలబడతామని స్పష్టం చేసింది.

సర్వేలో వివరాలు నమోదు చేయించుకున్న సీఎం

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలను నమోదు చేయించుకున్నారు. గురువారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–44లోని సీఎం నివాసానికి వెళ్లిన ఎన్యుమరేటర్లు ఆయన వివరాలను నమోదు చేశారు. వారితో పాటు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సర్వే పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైద్యారోగ్య శాఖకు సీఎం అధిక ప్రాధాన్యం

వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు ప్రభుత్వం తెలిపింది. భారీగా నిధుల కేటాయింపుతో పాటు ఆరోగ్యశాఖలో నియామకాలపైనా దృష్టి సారించి తదనుగుణంగా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొంది. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రెండింతలు చేసిన ముఖ్యమంత్రి.. తొలి ఏడాదిలోనే వైద్యారోగ్య శాఖలో నియామకాలు జరపడంతో పాటు నూతన వైద్య, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల మంజూరు, సీట్లు, పడకల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభుత్వం వివరించింది. దేశంలో తొలిసారిగా ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల జారీకి పైలెట్ ప్రాజెక్టు చేపట్టిన విషయాన్ని ప్రభుత్వం వివరించింది. ఈ కార్డులతో రాష్ట్ర హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, రోగి వివరాలన్నీ హెల్త్ ప్రొఫైల్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించింది.

ఏడాది కాలంలో వైద్యారోగ్యశాఖలో చేపట్టిన కార్యక్రమాలపై ప్రభుత్వ వివరాలు సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో

విద్యార్థుల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే వేటే..

మొదటి పేజీ తరువాయి

ఏమాత్రం ఏమరుపాటుగా ఉండవద్దని స్పష్టం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలినా సదరు అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

తరచూ తనిఖీలు చేయండి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందించే విషయంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వొద్దని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై ఇదివరకే పలుమార్లు సమీక్షించానని గుర్తు చేశారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు తరచూ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. ఈ మేరకు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రతిష్టపాలు చేసేందుకు కొందరి యత్నాలు

విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని.. పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము ఇలా సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నా.. కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ప్రకటించారు. వసతి గృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా వదంతులు సృష్టిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఆహార నాణ్యతపై టాస్క్‌ఫోర్స్!

మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థలు, హాస్టళ్లు, ఆస్పత్రుల్లో పంపిణీ చేస్తున్న ఆహారం నాణ్యత పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మొదలు... సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు, వసతిగృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభు త్వ వైద్య కళాశాలల్లో అందించే ఆహారం నాణ్య తపై నిఘా, పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ కమి టీని ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖతోపాటు గిరిజన, బీసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖలు, వైద్యారోగ్య శాఖ పరిధి లోకి వచ్చే అన్ని విద్యా సంస్థల్లో అందించే ఆహా రం నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ కమి టీకి అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో సభ్యులుగా ఫుడ్ సేఫ్టీ కమిషనర్ లేదా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సంబంధిత విద్యా సంస్థ ఉన్నతాధికారి/ అదనపు సంచాలకుడు, విద్యా సంస్థ జిల్లా స్థాయి అధికారి (డీఎస్‌డబ్ల్యూఓ/ డీటీడబ్ల్యూఓ/డీబీసీడబ్ల్యూఓ/ డీఈఓ) తదితరులుంటారు. ఈ కమిటీ నిర్దేశించిన విద్యా సంస్థలను సందర్శించి ఆహార భద్రత చర్యలను పరి శీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా సంస్థలో లోటుపాట్లను గుర్తిస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు బాధ్యులపై చర్యల కోసం సిఫార్సు చేయాలని సూచించింది.

విద్యా సంస్థల్లో ఫుడ్ సేఫ్టీ కమిటీలు, పర్యవేక్షక అధికారి

టాస్క్‌ఫోర్స్ మాత్రమేకాకుండా విద్యా సంస్థల స్థాయిలో ఫుడ్ సేఫ్టీ కమిటీలను, పర్యవేక్షక అధికారిని సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి సంబంధించిన మార్గదర్శ కాలను జారీ చేసింది. విద్యా సంస్థల్లో మెరుగైన, బలవర్ధకమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. కలుషిత ఆహారంతో కలిగే అనా రోగ్య సమస్యలు, తదుపరి పరిణామాల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిటీలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

- ఫుడ్ సేఫ్టీ కమిటీలో విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయుడు/ ప్రిన్సిపల్/ వార్డెన్‌తోపాటు మరో ఇద్దరు సిబ్బంది సభ్యులుగా ఉంటారు.
- ఈ కమిటీ సభ్యులు ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట గదిని తనిఖీ చేయాలి. తర్వాత వంటగది నిబంధనలకు అనుగుణంగా నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారించాలి.
- వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను కమిటీ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాతే విద్యార్థు లకు అందించాలి. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాలి.
- త్వరలో నోడల్ డిపార్టుమెంట్ యాప్‌ను తయారు చేస్తుంది. అప్పటి నుంచి తనిఖీలకు సంబంధించిన ఫోటోలను, ఇతర సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ఇక జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి విద్యాసంస్థకు ప్రత్యేకంగా ఒక పర్యవేక్షక అధికారికి నియమిస్తారు. ఈ పర్యవేక్షక అధికారి ప్రతిరోజు భోజనం వండే ముందు, తర్వాత తనిఖీ చేస్తారు. అక్కడి పరిస్థితిని చిత్రాలు తీసి జిల్లా కలెక్టర్/ సంబంధిత ఉన్నతాధికారికి సమర్పిస్తారు.
- వీటన్నింటికి సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.



విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ మల్హర్ మండలం మల్లారం కస్తూర్బా గాంధీ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి అల్పాహారం, భోజన సదుపాయాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఆహార నాణ్యత పరిశీలనకు ప్రతీ శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీవోలు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి పరీక్ష ఫీజు గడువును మరోసారి పెంచారు. విద్యార్థులు డిసెంబర్ 5వ తేదీ వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చని పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్యపు రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.200తో 19 వరకు, రూ.500తో డిసెంబర్ 30 వరకూ ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

తల్లి మృతితో అనాథలైన ఐదుగురు చిన్నారులు



వనపర్తి రూరల్: కాయకష్టం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తల్లి మృతి చెందడంతో ఐదుగురు చిన్నారులు అనాథలయ్యారు. ఈ హృదయ విషాద ఘటన వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివారాలలోకి వెళ్తే.. చిమనగుంటపల్లికి చెందిన పానుగంటి సునీత (35)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సునీత కూలీ పనులు చేసుకుంటూ.. వచ్చిన డబ్బులతో మందులు కొంటూ, పిల్లల బాగోగులు చూసుకుంటున్నారు. ఈ క్రమంలోనే నెల రోజులు క్రితం ఇంటి వద్ద కిందపడి తలకు తీవ్ర గాయమైంది. వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. కాగా తండ్రి ఉసేనయ్య మూడేళ్ల క్రితమే మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు.

పేటలో రూ.300 కోట్లతో ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ



మాట్లాడుతున్న రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

- రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

నర్వ: జిల్లా ఆయిల్‌పాం సాగులో 30 వేల ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేస్తే రూ.300 కోట్లతో ఆయిల్‌ఫెడ్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం జలందర్‌రెడ్డి ఫామాయిల్ తోటలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 13,600 ఎకరాలు ఆయిల్‌పాం పంట సాగు చేస్తున్నారని, 25 వేల ఎకరాలు పంటను రైతులు సాగు చేసేలా అధికారులు వారిని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పాం పంటకు చాలా అనుకూలంగా ఉందని 30 వేల ఎకరాలు పంట లక్ష్యంగా అందరు పనిచేస్తే జిల్లాలో రూ.300 కోట్లతో త్వరలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలో పంట సాగు లక్ష్యం పెరిగితే ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని, నూనె గింజల ఉత్పత్తి పెరిగి ఆయిల్ అందరికి అందుబాటు ధరలో దొరుకుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం మరో 617 మంది రైతులు డీడీలు చెల్లించారని మరింత మంది రైతులు ముందుకు వచ్చి పంటను సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు.

అంతర పంటలు సాగు చేయాలి

రైతులు ఆయిల్‌పాం పంట సాగుతో పాటు అంతర పంటలు సాగు చేయాలని, దీంతో కలుపు మొక్కలు రాకుండా దిగుబడి సైతం బాగా వృద్ధి చెందుతుందని వివరించారు. దీంతోపాటు నాలుగు ఏళ్ల మొక్కల మధ్య కోకో పంట సాగు చేస్తే ఎకరానికి రూ.1.50 లక్షల వరకు అందిపుచ్చుకోవచ్చన్నారు. ఉమ్మడి పాలమూరులో 28, 29, 30 మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు సదస్సులో పాల్గొని సాగులో మెలకువలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారులు జన్ను సత్యనారాయణ, సమీనాభేగం, ఫీల్డ్ ఆఫీసర్లు కిషోర్, ఫయాజ్, ఖదీర్, మేఘన, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నా కుటుంబ సభ్యులు అని చెప్పడం సిగ్గుచేటు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఒకే పార్టీలో ఉన్న సమయంలోనే నా కుటుంబ సభ్యులు, నా ఫాలోవర్స్ నంబర్లను ట్యాపింగ్ చేయించారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. ట్యాపింగ్ విచారణకు హాజరైన ఆయన నా కుటుంబ సభ్యులవే ట్యాప్ చేయించానని చెప్పడం సిగ్గుచేటన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్యాపింగ్ చేయించిన వారి పేర్లు చెప్పిన ఎమ్మెల్యే, వారంతా నీ కుటుంబ సభ్యులా అని నిలదీశారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప, ఇలా దొంకతిరుగుడుగా వ్యవహరించడం తగదన్నారు. నియోజకవర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన మాజీ ఎమ్మెల్యే అభివృద్ధి కోసం సలహాలిస్తే స్వీకరిస్తానని.. ఇలా అనవసరంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తున్న సందర్భంగా రైతు వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చిందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రైతు రుణమాఫీని ఒక యుద్ధంలా చేపట్టి.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. కొన్ని కారణాలతో నిలిచిపోయిన రుణమాఫీ డబ్బులను శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగే సీఎం సభలో అక్కడే మిగిలిన వాళ్లకు డబ్బులు జమచేస్తారన్నారు. ఇప్పటికే ప్రారంభమైన సంబరాల్లో రాష్ట్ర మంత్రులు పాల్గొంటుండగా.. శనివారం సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయే తప్ప ప్రజా సమస్యలను పరిష్కరిస్తుంటే వారికి కండ్లు మండుతున్నాయన్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలలో ఏమైనా నిజాలు ఉంటే నేను వాటిపై చర్చకు సిద్ధమన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు బాలునాయక్, రవి, ఎజాస్, నాయకులు ఆనంద్ కుమార్, సంజీవ్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, హన్మానాయక్, శ్రీధర్‌రెడ్డి, చిన్నరాంరెడ్డి, రేష్మ, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల కోసం ఇంజినీర్ల నిరసన



ఈగలపెంటలో భూగర్భ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఇంజినీర్లు

దోమలపెంట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది ఏళ్లు గడుస్తున్నా భూగర్భ కేంద్రంలో బదిలీలు చేయకపోవడంతో కేంద్రంలో పని చేస్తున్న ఇంజినీర్లు గురువారం సీఈ ఛాంబర్‌లో నేలపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం సీఈ రామసుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రతి ఏటా జరగాల్సిన బదిలీలను గత ప్రభుత్వం క్లిష్టతరం చేసి జరగకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో కేంద్రంలో కొద్ది మంది ఇంజినీర్లు అదనపు భారాన్ని మోస్తూ పని చేయడం జరిగిందన్నారు. గత జెన్‌కో యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా కొత్త నియామకాలు జరిగినప్పుడు బదిలీలు చేస్తామని కాలం వెళ్లదీస్తున్నారన్నారు. దీనికి అనుగుణంగా అన్ని శాఖల్లో బదిలీలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఫలితంగా ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు జరిగాయన్నారు. కాని జెన్‌కోలో జరగలేదన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వ ఏర్పడి కొత్త నియామకాల ప్రక్రియ పూర్తయి వారికి పోస్టింగ్‌లు ఇవ్వడానికి కూడా యాజమాన్యం సిద్ధమౌతోందని, పాత వారికి బదిలీల ప్రక్రియ చేపట్టకపోవడం, మరోవైపు కొంతమందికి సిఫార్సుల ఆధారంగా బదిలీలు ఇవ్వడం వల్ల ఇంజినీర్లలో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికే ముగ్గురు సీఎండీలు మారడం, పూర్తిస్థాయి డైరెక్టర్లు లేకపోవడం కొత్త డైరెక్టర్ల నియామకం జరగకపోవడం వంటి పలు కారణాలు వల్ల బదిలీల ప్రక్రియలో పురోగతి లేక ఇంజినీర్ల పాలిట శాపంగా మారిందన్నారు. యాజమాన్యం ఎలాంటి ఉలుకు, పలుకు లేకపోవడంతో ఇంజినీర్లందరు చీఫ్ ఇంజినీర్ ఛాంబర్‌లో నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేసినట్లు టీజీపీఈఏ, టీఎస్ఈఏఈఏ బ్రాంచి సెక్రటరీలు మదన్‌మోహన్‌రెడ్డి, చరణ్ తెలిపారు.

ప్రతి విద్యార్థిని మన బిడ్డగానే భావించాలి

- తాము అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద

మక్తల్/ మాగనూర్: పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిని మన బిడ్డగానే భావించి.. మధ్యాహ్న భోజనం పెట్టాలని, ఏమాత్రం చిన్నపొరపాటు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద అన్నారు. గురువారం మాగనూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి.. ఫుడ్ పాయిజన్ ఘటనకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో వివరాలు సేకరించారు. స్టోర్ రూం, బియ్యం, కూరగాయలు, తాగునీరు తదితర వాటిని పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఎవరూ భయపడొద్దని, ఏమైనా సమస్యలు ఉంటే తమకు చెప్పాలని సూచించారు. భవిష్యత్‌లోనూ సెల్ నం.94905 55533కు ఫోన్ చేస్తే తాము వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో విద్యార్థులు మాట్లాడుతూ నాసిరకం గుడ్లు పెడుతున్నారని, బియ్యం సక్రమంగా శుభ్రం చేయడం లేకపోవడంతోనే అస్వస్థతకు గురయ్యామని పేర్కొన్నారు. పాఠశాలను కలెక్టర్, అదనపు కలెక్టర్, మిగతా అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించినా తమ గోడు వినిపించుకోలేదని వాపోయారు. ఇక ముందు ఏమాత్రం ఇబ్బంది కలిగినా తమకు ఫోన్ చేస్తే వచ్చి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆమె వెంటనే తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ రహమత్, డిప్యూటీ డీఎంహెచ్ఓ శైలజ, ఎంఈఓ అనిల్‌గౌడ్, హెచ్ఎం వెంకట్రాములు, రాఘవేంద్రచారి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద

కురుమూర్తి స్వామి దర్శనానికి భక్తుల రద్దీ

వైభవంగా జాతర ఉత్సవాలు



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జాతర మైదానంలో రద్దీ

చిన్నచింతకుంట: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కురుమూర్తి స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. జాతర ఉత్సవాలకు రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర, రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. గురువారం ఉదయం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూలైన్‌లో నిల్చున్నారు. ఆలయ పూజారులు ఆలయ శుద్ధి చేసి సుప్రభాత సేవతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి పాదాలు తాకితే పాపాలు తొలిగిపోతాయన్న భక్తుల ప్రగాఢ నమ్మకం దీంతో ఉద్దాల మండపం వద్ద స్వామి వారి పాదుకలు దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు కట్టారు. అలువేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవ స్వాముల ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

బంగారు, వెండి ఆభరణాలు చోరీ

లింగాల: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంటిలో చోరీ అయిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మానుపాటి డేగమ్మ ఆరోగ్యం బాగా లేక పోవడంతో చికిత్స కోసం అచ్చంపేట ఆస్పత్రికి వెళ్లింది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న అరతులం బంగారం, వెండి, నగదును చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.